క్లుప్తంగా

తడి, పొడి చెత్త డబ్బాలు పంపిణీ

హనుమంతునిపాడు: మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు బుధవారం తడి, పొడి చెత్త నిల్వ చేసుకునే డబ్బాలను ఎంపీపీ గాయం సావిత్రి, ఎంపీడీఓ కె.లలిత బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీలకుగానూ 13 గ్రామ పంచాయతీలలో 4000 ఇళ్లకు ఒక్కొక్క ఇంటికి రెండు ప్లాస్టిక్ డబ్బాల చొప్పున మొత్తం 8000 డబ్బాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇళ్లలో నుంచి వచ్చిన తడి, పొడి చెత్తను నిల్వ చేసుకుని పంచాయతీ కసువు బండి వచ్చినప్పుడు అందులో వేయాలని సూచించారు. మిగిలిన 10 పంచాయతీలకు కూడా త్వరలో డబ్బాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గాయం బలరామిరెడ్డి, గాయం ఈశ్వరమ్మ, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, ఏఓ కృష్ణారావు, గ్రామ సర్పంచ్ కత్తి రాజారావు, సానికొమ్ము బ్రహ్మారెడ్డి, నాయకులు వెంకటకాశయ్య, మద్ది తిరుపతయ్య, మధుసూదన్‌రెడ్డి, రఘురామ్, కొండారెడ్డి పాల్గొన్నారు.

ఏపీ సీపీఎస్ ఈఏ జిల్లా అధ్యక్షునిగా రమేష్‌బాబు



కనిగిరి రూరల్: ఏపీ సీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షునిగా వేముల రమేష్‌బాబు నియమితులయ్యారు. ఆయనను పలువురు ఉపాధ్యాయులు కలిసి అభినందించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ సీపీఎస్(జీపీఎస్)ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే రాజా, గురవయ్య, ఐ.వెంకటేశ్వర్లు, రామకృష్ణ, హరిబాబు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

80 శాతం పింఛన్ల పంపిణీ

హనుమంతునిపాడు: మొదటి రోజు బుధవారం 80 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ కె.లలిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ కేటగిరీలకు చెందిన పింఛన్ లబ్ధిదారులు 4,534 మంది ఉన్నారన్నారు. వారిలో మొదటి రోజునే వలంటీర్లు 80 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.

బాల్యవివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

సీఎస్ పురం (పామూరు): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా బాల్యవివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే దేవకృపావరం హెచ్చరించారు. స్థానిక సచివాలయంలో బుధవారం బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులకు 21 సంవత్సరాలు, స్త్రీలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులు, ఐసీడీఎస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మెరుగైన వైద్య సేవలు



గర్భిణికి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సరస్వతి

జరుగుమల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్ సరస్వతి పేర్కొన్నారు. మండల పరిధిలోని వావిలేటిపాడు గ్రామంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 116 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ హరిత, ఏఎన్ఎమ్ రాజీ, హెచ్‌వీ తిరుపతమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

పామూరు: 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ సూచించారు. స్థానిక ఒకటో సచివాలయంలో బుధవారం పామూరు, సీఎస్ పురం మండలాల బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈ నెల 4, 5 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ప్రత్యేక క్యాంపెయిన్‌లో ఓటు నమోదు, తొలగింపు, తప్పుల సవరణలు చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా ఇటీవల నిర్వహించిన ఇంటింటికి ఓటు వెరిఫికేషన్ కార్యక్రమంలో పలు అంశాలకు సంబంధించినవి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పామూరు తహసీల్దార్ ఆవుల సురేష్, సీఎస్ పురం తహసీల్దార్ షేక్ నాగూర్‌మీరా, పామూరు, సీఎస్ పురం మండలాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం



కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న వల్లూరు విద్యార్థులు



కనిగిరిలో పొట్టి శ్రీరాములు, ప్రకాశం పంతులు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్, ఎంపీపీ ప్రకాశం



వెలిగండ్లలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ వాసు

కనిగిరి రూరల్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు, టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందినట్లు చెప్పారు. 1956 నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్రంతో హైదరాబాద్ విలీనం కావడం జరిగిందని వివరించారు. చంద్రబాబు ప్రభుత్వంలో సంప్రదాయంగా వస్తున్న అవతరణ దినోత్సవానికి స్వస్తి పలికారని విమర్శించారు. నవంబర్ 1న మాత్రమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం జరపాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయించిందని, పాత సంప్రదాయాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్దన్, ఆర్.మాణిక్యరావు, మండల ఉపాధ్యక్షుడు ఎల్.తిరుపతిరెడ్డి, జీ ధనుంజయ్, పార్టీ వైద్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, రాష్ట్ర జిల్లా నాయకులు సీహెచ్ సాల్మన్, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, గురుప్రసాద్, కౌన్సిలర్లు దాసరి మురళి, అబ్రహం లింకన్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, పార్టీ యూత్ పట్టణ, మండల అధ్యక్షులు ఎస్‌కే రసూల్, మాలీ, నాయకులు శ్రీహరిరెడ్డి, మన్సూర్, నాగూర్‌బీ, భారతి, బాలాజీ, కిషోర్, మున్నా, అచ్చాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయంలో...

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని కనిగిరి ఆర్డీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ మాట్లాడుతూ మహనీయుల త్యాగ స్ఫూర్తిని గుర్తు చేశారు. తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పామూరులో...

పామూరు: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పామూరులో వాసవీ క్లబ్స్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం వద్ద అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్యసంఘ నాయకులు, వాసవీక్లబ్స్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవతరణ అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగఫలితమేనన్నారు. తెలుగు మాట్లాడేవారంతా ఒకేరాష్ట్రంగా ఉండాలని భావించిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో పబ్బతి నారాయణ, దరిశి మస్తాన్‌రావు, శేగు కృష్ణయ్య, గోష్టు రామారావు, వాసవీ క్లబ్, వనితాక్లబ్ అధ్యక్షులు, సభ్యులు కోటా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడులో...

హనుమంతునిపాడు: మండల కేంద్రంలో బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతణ దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ గాయం సావిత్రి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ కె.లలిత పాల్గొని అమరజీవి పొట్టి శ్రీరాములు, టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం ఈశ్వరమ్మ, ఏడీ గాయం వినయ్‌కుమారెడ్డి, గ్రామ సర్పంచ్ కత్తి రాజారావు, ఎంఈఓ ఎస్.రమణయ్య, ఏఓ కృష్ణారావు, కార్యాలయ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, గాయం కొండారెడ్డి, రఘురామ్, ఉపసర్పంచ్ ఇట్టెం కృష్ణ, కార్యదర్శి బ్రహ్మచారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్ పురం మండలంలో...

సీఎస్ పురం (పామూరు): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మండలంలోని తిమ్మరాజుపాలెం ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాములు విగ్రహానికి హెచ్‌ఎం డి.చెన్నకేశవులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వెలిగండ్లలో...

వెలిగండ్ల: ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో అన్యాయానికి గురవుతున్నామనే భావనతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండ్‌కు బీజం పడిందని తహసీల్దార్ ఎస్.వాసు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు

టంగుటూరు: ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలను కొండపి నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. టంగుటూరులోని గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి లైబ్రేరియన్ గుమ్మడి వర్ధనరాజు, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు ప్రియాంక పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జానుబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస

68వ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఒంగోలు స్పందన హాల్లో బుధవారం కలెక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టంగుటూరు మండల వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి కలెక్టర్ చేతులమీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు. వారిని హెచ్‌ఎం రమణయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



కనిగిరి ఆర్డీఓ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్

సింగరాయకొండ: కలికవాయ ప్రాథమికోన్నత పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి హెచ్‌ఎం నిడమానూరి సురేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. పీఎంసీ చైర్మన్ చామల వేణుగోపాలరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు బత్తుల వెంకట సుబ్బారెడ్డి, గ్రామ పెద్ద లంకపోతు సీతారామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాజుపాలెంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పామూరులో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీక్లబ్స్, ఆర్యవైశ్య సంఘ నాయకులు

కొండపి(సింగరాయకొండ): అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేనిదని గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు కొనియాడారు. కొండపి మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



టంగుటూరు గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం



హనుమంతునిపాడులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు



సింగరాయకొండ మండలం కలికవాయ పాఠశాలలో..



కొండపి శాఖా గ్రంథాలయంలో..

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

- 8న కనిగిరిలో సామాజిక, సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ
- మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం పిలుపు



ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న చైర్మన్, ఎంపీపీ, రంగనాయకులు

కనిగిరి రూరల్: సామాజిక సాధికార బస్సు యాత్రను కనిగిరి నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులంతా సమాయత్తం కావాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఈ నెల 8న కనిగిరిలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభలో అన్నివర్గాల పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. పేద వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసి అధిక ప్రాధాన్యతను సీఎం వైఎస్ జగన్ కల్పించారని వివరించారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీకృష్ణ మాట్లాడుతూ బీసీలంటే బ్యాక్ వర్డ్ కాదని, బ్యాక్ బోన్ అని చెప్పిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే బీసీల అభ్యున్నతి జరిగిందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ 12 గంటలకు మండలంలోని ఎడవల్లిలో సామాజిక, సాధికార బస్సు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి యాత్ర నేరుగా పట్టణ ప్రధాన వీధుల్లో తిరుగుతుందన్నారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక చర్చి సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. తొలుత సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రచార ఫ్లెక్సీలు విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు పులి శాంతి, ఆర్.మాణిక్యరావు, అబ్రహం లింకన్, జీ ధనుంజయ్, ఎల్.తిరుపతిరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు సీహెచ్ సాల్మన్, గురుప్రసాద్, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, వేల్పుల వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ సర్పంచ్ మల్లెల యాకోబు, మీరావలి, కంటు గురవయ్య, మన్సూర్, నాగూర్‌బీ, భారతి, డాక్టర్ రసూల్, మాలీ యాదవ్, షఫీ ఆజాద్, శ్రీహరిరెడ్డి, మున్నా, దాసరి మురళి, గోవిందరెడ్డి, నారాయణరెడ్డి, సమద్, అచ్చాల శ్రీను, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గుండె వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చైతన్య

కనిగిరి రూరల్: ప్రస్తుత కాలంలో వయసుతో సంబంధం లేకుండా గుండె వ్యాధులు వస్తున్న తరుణంలో యువత, విద్యార్థులు గుండె వ్యాధిపై కనీస అవగాహన కలిగి ఉండాలని గుండె వైద్య నిపుణులు డాక్టర్ బీపీఎం కే చైతన్య సూచించారు. స్థానిక విజేత కళాశాలలో మదర్ థెరిస్సా సేవా సమితి, ఏబీ క్లినిక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ గుండె పోటు లక్షణాలు కనిపించినప్పుడు తక్షణ ప్రాథమిక జాగ్రత్తగా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. సీపీఆర్ ఉపయోగించడం వలన కలిగే లాభాలు, వ్యాధి గ్రస్తులను ప్రాణాపాయం నుంచి కాపాడటం, తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. కళాశాల విద్యార్థులచే ప్రాక్టికల్‌గా చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో థెరిస్సా సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎన్ రసూల్, పి.అరుణోదర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌యాసీన్, ఆర్ఎంపీలు ఎస్‌కే నాయబ్ రసూల్, పచ్చవ శేఖర్, డి.చెంచులు, న్యాయవాది సయ్యద్ షాహిద్ జానీ, వివిధ సంఘాల నాయకులు వాగిచర్ల వెంకటేశ్వర్లు, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'పై వర్క్‌షాప్

టంగుటూరు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ అనే అంశంపై అవగాహన సదస్సు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని నిర్వహిస్తారు. మండలంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరుకావాలని సూచించారు.

ఎస్పీ మలికా గర్గ్‌ను కలిసిన వరికూటి



ఎస్పీ మలికా గర్గ్‌తో వరికూటి అశోక్‌బాబు, నాయకులు

టంగుటూరు: ఎస్పీ మలికా గర్గ్‌ను వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు బుధవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరికూటి అశోక్‌బాబు నియోజవర్గంలోని శాంతి భద్రతలు, ట్రాఫిక్ తదితర అంశాలపై చర్చించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు, టంగుటూరు మండల జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, సింగరాయకొండ నాయకులు గుండపరెడ్డి శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు



వార్డుల్లో పర్యటిస్తున్న కమిషనర్ నారాయణరావు

కనిగిరి రూరల్: వార్డుల్లోని సమస్యలన్నీ ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. పట్టణంలోని 4, 5 వార్డుల్లోని ఎస్సీ పాలెం, గడ్డమీదపల్లి తదితర కాలనీల్లో బుధవారం కమిషనర్ పర్యటించారు. స్థానికులు పలు సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. కమిషనర్ నారాయణరావు మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు అత్యవసర ప్రాంతాలను, నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్లు ఏర్పాటు చేస్తానని, నాలుగు రోజుల్లోపు తీవ్ర నీటి సమస్య ఉన్న ఏరియాల్లో డీప్‌బోర్‌వెల్స్ ఏర్పాటు చేసి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని చెప్పారు. ఆ మేరకు ఇంజినీరింగ్ అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. పారిశుధ్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులును ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎర్రబల్లి దేవరాజ్, మాలకొండయ్య, గుండ్లతోటి మధు, స్థానిక నాయకులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాకల విద్యార్థుల ప్రతిభ



జూడోలో కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సింగరాయకొండ: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడు పతకాలు సాధించినట్లు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో మూడు కాంస్య పతకాలు సాధించారన్నారు. అండర్–14 కేటగిరీలో 36 కేజీల విభాగంలో వాయిల యమున, 50 కేజీల విభాగంలో వాయిల ప్రసన్నకుమార్, అండర్–19 కేటగిరీలో 66 కేజీల విభాగంలో మామిళ్ల రాకేష్ ఈ ఘనత సాధించారని పాఠశాల పీడీ హజరత్తయ్య వివరించారు. విద్యార్థులను అభినందించారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

- జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి

కనిగిరి రూరల్: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి సూచించారు. మండలంలోని చీర్లదిన్నె, వంగపాడు పంచాయతీల్లోని రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చీర్లదిన్నె ఎంపీటీసీ, మండల జేసీఎస్ కన్వీనర్ అట్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులు, అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. వ్యవసాయాధికారి పీ జోత్స్నదేవి, డీఆర్‌సీ వ్యవసాయ అధికారి వీ వెంకట శేషమ్మ, వంగపాడు, కృష్ణాపురం, జమ్మలమడక సర్పంచ్‌లు, రైతు నాయకులు సిద్దారెడ్డి, వీఏఏ హబీబ్ జిలాని, ఆసిఫా బేగం తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

టంగుటూరు: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను మైనింగ్ అధికారులు మంగళవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కొణిజేడు, సర్వేరెడ్డిపాలెం గ్రామాల మధ్య కొండలో గ్రావెల్ తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు మూడు టిప్పర్లను మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్లను రవాణా శాఖ కార్యాలయంలో ఉంచారు. మైనింగ్ ఏడీ వీరేష్, ఆర్ఐ మురళీధర్, టీఏ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.